# కారుణ్య మరణం

"నీ పేరేంది?"

"వరలక్ష్మమ్మ."

"ఎందుకు చంపావు, నీ మొగుణ్ణి?"

"మరేం జెయ్యనయ్యా! ఆయన పడే బాధ చూడ లేకపోతిని. అది కుదిరే రోగం కాదు. అందుకే ఉరేసి చంపినా."

సిరిపల్లెలో తల్లీ కొడుకులు ఉరివేసి ముసలాయన్ని చంపేశారని వార్త వచ్చింది. అది చాల చిన్న పల్లెటూరు. అక్కడకు పొరుగున పది మైళ్ళదూరంలో ఉన్న బనవాడలో పోలీస్టేషను ఉంది. ఇన్‌స్పెక్టర్ శివరాం కొత్తగా డ్యూటీలో చేరాడు. ఒక కానిస్టేబుల్‌ని వెంటబెట్టుకుని జీపు తోలుకుంటూ వచ్చాడు. కాలేజీలో చదువుకున్న రోజుల్నీ, అప్పటి ఆదర్శాలనీ అతడింకా మర్చిపోలేదు. అరవైయేళ్ళ వరలక్ష్మమ్మ భర్త మరణానికి కుమిలి, కుమిలి ఏడుస్తోంది. "ఈ చేతుల్తోనే ఉరితాడేసి లాగినా. నన్ను చంపెయ్యయ్యా!" అని ఏడుస్తోంది ఆమె. ఆమె దుఃఖం హృదయ విదారకంగా ఉంది. కానీ తప్పదు కనుక, ఇంటరాగేషను మొదలెట్టాడు. అప్పుడొచ్చాడు ఆమె రెండో కొడుకు. ఇన్‌స్పెక్టరడిగితే తన పేరు ప్రదీప్ అని చెప్పాడతను.

"ఎక్కడికెళ్ళావు?"

"చచ్చిన నాయన్ని దహనం చెయ్యాలిగా! కొంపలో పైసలేదు. నా స్నేహితుడి దగ్గరకు వెళ్ళాను, అప్పుకోసం. వాడు రెండువేలు మాత్రం ఇవ్వగలిగాడు. కనీసం ఇదువేలయినా లేకపోతే శవం లేవటం కష్టం!"

"మీ నాయన బాధ చూడలేక ఆయన్ని చంపానని మీ అమ్మ అంటున్నది. నువ్వేమంటావు?"

"మా అమ్మకు నేనంటే ప్రాణం! అందుకే, నేను చేసిన నేరాన్ని తన నెత్తిన వేసుకుంటున్నది. ఆయన్ని ఉరేసి చంపింది నేనే!"

"మీ నాయన్ని నువ్వు ఉరేసి చంపింది డబ్బు కోసమేనా?"

"చంపాను కానీ, డబ్బు కోసం కాదు. మా నాయన పనికిరానివాడు, ఆత్మీయులకు కూడ ద్రోహం చేసేవాడు, దుర్మార్గుడు. చావాల్సిన వాడే, అందుకే చంపేశాను. నన్ను అరెస్టు చెయ్యండి, నేను నేరం అంగీకరిస్తున్నానుగా? ఆ మిగిలిన మూడువేలు ఊరివాళ్ళేసుకుని ముసలాడిని సాగనంపుతారు. చచ్చిన నాయనకు దహనం చెయ్యలేని కొడుకు ఉన్నా లేకున్నా ఒకటే!"

"ఎంత చెడ్డవాడయితే మాత్రం, నువ్వు చట్టాన్ని చేతిలోకి తీసుకుంటావా? ఇంతకీ మీ నాయన చేసిన దుర్మార్గ మేంది? నువ్వేం చేస్తున్నావు?"

ఇలా వేసిన సవాలక్ష ప్రశ్నలకు ప్రదీప్ జవాబిచ్చాడు. అతని తండ్రి రామదాసు సబ్‌పోస్టుమాస్టరు ఉద్యోగం చేశాడు. అది పై సంపాదనరాని ఉద్యోగం. ఉన్నా, "ఆ తెలివితేటలు లేని మనిషి" ప్రదీప్ అభిప్రాయంలో. ఆయనకిద్దరుకొడుకులు, ఒక కూతురు. కూతురు పెళ్ళి చేసేశాడు. ఆమె షాద్‌నగర్‌లో తన భర్తతో కాపురం చేసుకుంటున్నది. పెద్దకొడుక్కు చదువంతగా ఒంట బట్టలేదు. అతడు వ్యాపారం చేసుకుంటానంటే, సిరిపల్లెలో తనకున్న అరెకరం పొలం అమ్మేసి, వచ్చిన లక్షరూపాయల్ని కొడుక్కు వ్యాపారంలో పెట్టుబడి కింద ఇచ్చాడు. పెద్ద కొడుకు కామేశ్వరరావుకు ఆ డబ్బు చాలలేదు. అంతకుముందు ఉన్న తాగుడు వ్యసనం ఈ డబ్బుతో విజృంభించింది. చేసేందుకు వ్యాపారం లేదుగానీ, జల్సా పెరిగింది. 'అదేమిట'ని అడిగిన తండ్రిని కొట్టొచ్చేవాడు. అంతటితో ఆగలేదు అతడి ఆగడాలు. అప్పుడతడు బిజినెస్ వంకన బనవాడలో ఉండేవాడు. అతడి స్నేహితుడు రమణ; ఆ వెధవ ప్రేమించానని ఒక ఇంటర్మీడియెట్ అమ్మాయిని మాయమాటలతో కామేశ్వరరావు గదికి తీసుకు వచ్చాడు. ఆడది తేరగా దొరిగ్గానే ఆ పిల్లపై కామేశ్వరరావు, రమణ, మరో ఇద్దరు స్నేహితులు అత్యాచారం చేశారు. విషయం బయటకు పొక్కింది. నిందితులను అరెస్టుచేసి, కోర్టులో కేసు పెట్టారు. "మా నాయన దుర్మార్గుడు! కొడుకు ఏ పరిస్థితుల్లో అట్లాంటి పని చేయాల్సొచ్చిందో ఏమాత్రం విచారించ లేదు. జడ్జి వాడికి ఏడేళ్ళు శిక్ష వేయకముందే, ఈయన వాడు దోషి అన్న నిర్ధారణకొచ్చాడు. కొడుకు తరపున వాదించటానికి లాయరును కూడ పెట్టలేదు. నలుగురిలో అధిక కాలపు శిక్ష పడింది మా అన్నకే. కారణం వాడికొక్కడికే లాయరు లేదు. కోర్టు అప్పాయింట్ చేసిన ప్లీడరు మా వాడి తరఫున ఏం వాదిస్తాడో మీకు తెలవంది కాదు" అని చెప్పాడు ప్రదీప్.

"అందుకు చంపావా, మీ నాయన్ని?"

"కాదు. అధికారులకు అణకువగా ఉండని మనిషి. అందుకే ఈయన్ని ఇష్టమొచ్చినన్ని సార్లు బదిలీ చేశారు. మేం కుదురుగా ఒక ఊళ్ళో చదువుకోలేక పోయాం. ఎన్ని ఊళ్ళు తిరిగాం? నౌకరీనుండి వాలంటరీ రిటైరుమెంటు తీసుకున్నాక ఇదుగో ఇక్కడ మా ఊళ్ళో సెటిలయినాం. నేనే కష్టపడి ఎలాగో చదువుకున్నా. ఎంసెట్‌లో రాంకు తెచ్చుకున్నా. గవర్నమెంటు కాలేజీలో సీటొచ్చింది. 'పెద్దగా ఫీజు ఉండదు, అక్కడ జేరు' అన్నాడు. అది హైదరాబాదులో. మాటలా పైసలు గావాల. ప్రతినెలా పంపిస్తాననుండె మా నాయన! ఒకసారి పంపించేవాడు, మరోసారి కుదర్లేదనే వాడు. నేను ఎట్లా చదువు కోవాలి...?"

అతని మాటలకు అడ్డు వస్తూ, అతడి తల్లి వరలక్ష్మమ్మ కలగ జేసుకుంది.

"ఆయనేం జేస్తడు, నాయనా? కడుపులో కాన్సరు. మెలితిప్పే నెప్పి! డాక్టర్లు, మందులు! డబ్బు నీళ్ళలాగ కర్చుపెట్టినాక గానీ, మాకు తెలవకపాయె, అది చిన్న పేవుల కాన్సరని. అక్కడికీ, ఈలైనప్పుడల్లా, కొడుకు ఇబ్బంది పడతాడని పంపుతానే ఉండె. ఒకోసారి మందులు కూడ మానుకుని పైసలు పంపించె..."

"పంపిస్తే, నేనిట్లా చదువు చట్టుబండలు చేసుకుని ఎందుకు కూర్చుంటాను? నేను మొదట్లోనే చెప్పినా మా నాయనకు, అంత పట్నంల మనసంటోళ్ళు బతకలేరు, వద్దని. నా మాట వినకుండా పంపించిండు. నేనే ట్యూషన్లు చెప్పి, మిత్రుల సాయంతో, కష్టం మీద సెకండ్‌క్లాసులో పాసయ్యాను. సెకండ్‌క్లాసులో పాసయిన ఇంజనీరు నా కొడుక్కి ఉద్యోగ మెవడిస్తాడు?"

"ఏం జెయ్యమయ్యా, కొడుక్కు డబ్బు పంపాలని అయ్యకు లేక పోయెనా? రోగం ముదిరినాది. పెద్ద దవాఖానాలో చూపించినాం. అపరేషను చెయ్యాలన్నారు. రెండు లక్షలన్నారు. డబ్బులేదు. రోగంపేరు చెప్పి చెయ్యలేనని పని మానేసిండు. మూడు లక్షలొచ్చినాది. అపరేషనుకు, తిరగటానికీ, హైదరాబాదులో తిండ్లకు కర్సయిపోయినాయి. పని ముందే మానేసిండు గన్క రావల్సినంత పింఛను రాదు. బాగా తక్కువొస్తాది. ఈడిని చదువు మానెయ్య మన్నడు, మా ఆయన. ఈడు ఇనలేదు. కోపం వచ్చి ఇంట్లో నుండి ఎళ్ళిపోయిండు. అన్న విషయం తెల్సి ఇంటికి వచ్చిండు. మళ్ళా అప్పటినుండి వస్తుండె. అల్లుడు కట్నం చాల లేదని నా బిడ్డను ఏడిపిస్తునే ఉండె. ఆడిని ఊరుకోబెట్టటానికి ఆయ్న పని మానేసినప్పుడు వచ్చిన డబ్బులో దవాఖానా ఖర్చులకు పోను మిగతా యాభైవేలూ అల్లుడికి చదివించకున్నాం."

"ఆ యాభైవేలూ నాకిస్తే నేను ఫారెన్ వెళ్ళే ఛాన్స్‌వచ్చి ఉండేదేమో!"

"ఏం మాట్లాడతావయ్యా, యాభై వేలతో ఫారెన్ వెళ్ళే ఛాన్సు వస్తుందా?" అన్నాడు ఇన్‌స్పెక్టరు.

"వస్తుందో, రాదో అది వేరే విషయం! మా నాయన అందుకు ప్రయత్నించే అవకాశంకూడ లేకుండా చేశాడు నాకు. పాపిష్టివాడు! నేను చివరపుట్టినోణ్ణి కదా! నామీద ప్రేమలేదు నా కొడుక్కి! ఆ డబ్బు నాకివ్వాల్సింది పోయి గారాబు కూతురు కిచ్చుకున్నాడు. నాకూ, మా అన్నయ్యకూ అన్యాయం చేశాడు. అందుకే ముసలాడిని ఉరేసి చంపేసినా. నన్ను అరెస్టు చేసి పట్టుకెళ్ళండి, చచ్చిన మా నాయన ముఖం చూట్టానికి కూడ నాకు రోతగా ఉంది."

"వాడికేమీ తెలవదు నాయనా! ఆయనకు అంత డబ్బుపోసి ఆపరేషను చేయించినామా? మళ్ళా పరిస్థితి మొదటికే వచ్చినాది. మళ్ళీ రోగం తిరగబెట్టినాదంట! ఏందో విషమిచ్చి చూస్తామన్నారు, డాక్టర్లు! ఏందిరా అది?"

"కెమో థెరపీ. అదిచ్చినా బతుకుతాడన్న భరోసా వాళ్ళు ఇవ్వ లేదు..."

ఇక ఆమె కొడుకును మాట్లాడనివ్వ లేదు. "అది నాయనా! కత! మా తాన పైసలేదున్నాయి. ఛస్తే చావమని ఇంట్లోనే పెట్టుకుంటిమి. ఏదో పింఛను వస్తాదిగా, అది పెట్టుకుని కలో, గంజో తాగి బతుకుదా మనుకుంటిమి. కానీ, రోగం ఊరకుంటదా? కడుపులో నెప్పి ఆయనకు. ఆ నెప్పికి మనిషి నేలమీద పడి ఉంగలు చుట్టుకుపోయెటోడు. ఆ బాధ పడలేక, ఓ రోజు నా కాళ్ళు పట్టుకుని– తల్చుకుంటే గుండె తరుక్కు పోతాది, పెళ్ళాం కాళ్ళెవరయినా పట్టుకుంటారటయ్యా– 'ఒసే, నన్ను చంపెయ్యవే, నీకు పున్యముంటాది' అని అడిగిండు. 'ఏం మాటలయ్యా, ఇవి! మొగుణ్ణి చంపుకుని నేను బతికెటెందుకు, పద ఇద్దరం పోదాము' అంటిని. 'అట్లెట్లె, పెద్దోడు జైల్లనుండి ఎప్పుడొస్తడొ, చిన్నోడికి పెళ్ళి కాకుండె, నౌకరీ రాకుండె. బిడ్డను అల్లుడు సరిగ్గ చూస్తుండొ లేదొ తెలవదాయె. నువ్వుండు. ఈళ్ల మంచి, సెడ్డా నువ్వు చూడాల! నన్ను ఉరెయ్యి. నేనీ బాద బరించ లేకుంటి. నేనే ఏ ఎండ్రినో తెచ్చుకుందామంటే లేవటం కూడ నాకు కష్టమై పోయె' అనవట్టె. అందుకే ఆ బాద చూడలేక ఉరేసి చంపేసినా. నన్ను తీసుకెళ్ళు, నాయనా! నేనేదున్నాఒక్కటే!" అంది వరలక్ష్మమ్మ.

"లేదు ఇన్‌స్పెక్టర్! అసలు దోషిని నేను. తల్లి ప్రాణం కనుక అట్లా కొట్టుకుంటున్నది. నేను చేసిన నేరాన్ని తను చేసినట్లు చెప్తున్నది. కారుణ్య మరణం అని చిత్రిస్తున్నది. నన్ను అరెస్టు చెయ్యండి."

"యాభైవేలు ఇవ్వ లేదని తండ్రిని చంపుతారటయ్యా, ఎవరైనా? నాకు చెవుల్లో పూలుపెట్టకు!" అన్నా ఇన్‌స్పెక్టర్ శివరాం.

"యాభైవేలు మాత్రమే కాదు, మా నాయన తప్పుల చిఠాను విప్పితే నా పట్ల ఆయన ద్రోహచింతన మీకు తెలుస్తాది. మా కాలేజీలోనే నా క్లాసుమేటు, రాధను నేను ప్రేమించాను. ఆమె నన్ను ప్రేమించే అవకాశం ఉండొచ్చుగానీ, మా నాయనే నాకున్న అవకాశాన్ని బూడిద పాలు చేసిండు. నేనా పిల్లను ప్రేమిస్తున్నానని చెప్పాను. ఆమె తండ్రి మా నాయనకు తెలియనివాడు కాదు. పోస్టాఫీసు సూపరింటెండెంటుగా పని చేసి రిటైరయ్యాడు. 'వద్దురా, ఆయన డబ్బున్నోడు. అంత డబ్బున్న పిల్ల మనకు లాయికీ కాదు' అని వెనక్కి లాగాడు. నేను పట్టు బట్టాను. తప్పక, నన్ను వెంటబెట్టుకుని వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళిండు. ఆయన మనిషి మంచివాడే. మా నాయన్ను సాదరంగానే ఆహ్వానించిండు. 'ఎట్లా ఉన్నవోయ్! ఇప్పుడు ఆరోగ్యం ఎట్లా ఉంది? నువ్వు వాలంటరీ తీసుకోటం నాకిష్టంలేదు. నీ లాంటి సిన్సియర్ ఉద్యోగులు చాల తక్కువమంది ఉన్నారు మన డిపార్ట్‌మెంటులో. కానీ, ఆపరేషను చేయించుకోవాలి, అందుకు డబ్బు అవసర పడుతున్నదంటే, నేనేం మాట్లాడలేక పోయాను. నీకు ఇద్దరు కొడుకులు కదూ? పిల్లలేం చేస్తున్నారు?' అని అడిగాడు. మా నాయన నన్ను తన రెండో కొడుకని పరిచయం చేసిండు. 'నీ పెద్ద కొడుకేం చేస్తున్నాడ'ని అడిగితే, మా నాయన వాడు గాంగ్‌రేప్‌లో పాల్గొని జైలు జీవితం అనుభవిస్తున్నాడని చెప్తాడా? దాంతో ఆయన ముఖం మాడిపోయినాది. ముఖంలో ఎప్పటి ప్రసన్నత మాయమైనాది. మా నాయన ఆయనతో విషయం కదప సందేహించాడు కానీ, నేను ఊరుకోలేదు. భయపడిపోతూనే, 'వీడు మీ అమ్మాయిని ప్రేమించాట్ట! అమ్మాయికూడ ఇష్టపడితే, పెళ్ళి చేసుకుంటానంటున్నాడు' అని చెప్పాడు. ఆయన 'విన్నాను. మా అమ్మాయి చెప్పినాది. అలాంటి ఆశ నీ కుర్రాడి కుందని! కానీ, దాన్ని ఎమ్మెస్‌కు అమెరికా పంపిస్తున్నాను. మీ వాడు సెకండ్‌క్లాసులో పాసయ్యాట్ట! అలాంటి వాడికి ఏం నౌకరీ వస్తాది అని నా కూతురే అంది. సరే, నీ పెద్ద కొడుకట్లా! నీకు ఇన్‌టెస్‌టైనల్ కాన్సరు. నయమవుతుందో లేదో సందేహమే. ఇలాంటి కుటుంబంలోకి, ఒకవేళ మా అమ్మాయి రావటానికి ఒప్పుకున్నా, నేనెలా పంప అంగీకరిస్తాననుకుంటున్నావు! సారీ, నీ మీద నాకున్న మంచి ఇంప్రెషన్ పోయే రోజు వస్తుందనుకోలేదు. గుడ్‌బై' అని లేచాడు. మాకు తిరిగి రాక తప్పలేదు. అసలు రాంగానే మా నాయన్ను చంపాలనుకున్నాను. అవకాశంకోసం చూసినా. రాత్రి దొరికింది లేపేసినా" అన్నాడు ప్రదీప్.

"అంతమాత్రానికే తండ్రిని చంపుతారుటయ్యా ఎవరైనా?"

"మందు బాటిలు కొనటానికి డబ్బివ్వ లేదని మా అన్న ఆయన్ని చంపటానికి ఎన్నిసార్లు తయారయిండు! వాడిని శాంతపర్చేటప్పటికి మా అమ్మ పుతమారేది. ఆయన మాకు చేసిన మేలేంది? జీవితంలో పైకి పోవాలనే ఆశలేని మనిషి! డబ్బు సంపాదించాలన్న ఆరాటమే లేదు. దీనికి తోడు బోడి ఆదర్శాలు. కూతురి పెళ్ళికి కట్నమివ్వనన్నాడు. మా బావగారి తండ్రి ఈయన స్నేహితుడు కనుక, ఈయనకున్న పిచ్చి ఆయనకూ ఉంది కనుక, తన కొడుక్కు కట్నంలేకుండానే పెళ్ళి చేసుకున్నాడు, కోడలు గృహప్రవేశం, మామ గంగా ప్రవేశం పరిస్థితి అయిపోయినాది. ఆయన చావటంతోనే, మా బావ ఏకు మేకయి కూర్చున్నాడు. 'నాకు రెండు లక్షలు కట్నం ఎవరైనా ఇస్తారు. మా నాయన్ని మోసం చేసి ఈ మొదనష్టపుదాన్ని నా కంటగట్టారు. రెండు లక్షలివ్వండి, లేకపోతే మీకూతుర్ని మీ ఇంట్లోనే అట్టి పెట్టుకోండి' అని మొండికేశాడు. యాభైవేలిచ్చి ఊరుకోబెట్టారు. ఎప్పుడైనా అది భళ్ళున పగిలే బంధమే. యాభైవేలిచ్చి, మెల్లగా మిగిలిన డబ్బు ఇస్తామని చెప్పి ఇప్పటికి ఆపద గడుపుకున్నారు కదా, అప్పుడు ఆయన ఆదర్శాలు గాలికి కొట్టుకుపోయినవా లేదా? 'వాడు పాపం చేసిండు. అందుకు వాడు శిక్ష అనుభవించాల్సిందే' అని మా అన్నను గాలికి వదిలేశాడు. నా చదువు నేను సరిగ్గా చదువుకోకుండా చేశాడు. నేను ప్రేమించిన అమ్మాయిని నాక్కాకుండా చేశాడు. రాధ తండ్రికి మా అన్నయ్య విషయం చెప్పాల్సిన అవసరం ఉందా? 'దాచి నేను ఏ పనీ చేయను. అన్నీ చెప్తాను. ఆయన ఇష్టపడితే పిల్లనిస్తాడు' అని ఈ తప్పుడుకొడుకు నాకు ముందే వార్నింగ్ ఇస్తాడా? హి డజర్వ్స్ టుబి కిల్డ్ ఎటెనీ మోమెంట్. నేను మంచివాడిని కనుక, చంపటం ఆలస్యం చేశాను. ప్లీజ్ నన్ను పట్టుకెళ్ళండి, ఇన్‌స్పెక్టర్!" అన్నాడు ఆవేశంగా ప్రదీప్.

"లేదు, ఇన్‌స్పెక్టరుగారూ! ఆడికేం ఇందులో సంబందం లేదు. నన్నుతీసుకెళ్ళి ఉరేయండి. అంత మంచిమనిషి నా మొగుడు! నేను ఆయన బాద చూడలేక ఈ చేతుల్లో ఉరేశాను. చచ్చి ఏ లోకాన ఉన్నాడో ఆ దేవుడు. బతికిన రోజుల్లో ఒక్క తప్పుడుమాట మాట్లాడలేదు, ఒక్క తప్పుడు పని చేయలేదు. సూటిగీత ఆయన బతుకు. ఆయన బతుకులో ఎవరికీ మన్నింపులు చెప్పుకునే అవసరం పడలేదు. అలాంటిది తన పెద్ద కొడుకు చేసిన పాపానికి తన్ను మన్నించమని ఆ పిల్ల ఇంటికెళ్తే ఆళ్ళు ఈయన్ని చంపిచేసినంత పని చేసినారు. ఆ దెబ్బలకు నాలుగు రోజులు లేవలేక పోయాడు. నేను పోలీసు కంప్లెయింట్ ఇమ్మంటే ఏమన్నాడో తెల్సా– 'ఆళ్ళ పిల్లకు పెద్ద అవమానం జరిగినాది, మళ్ళా ఆపిల్ల జీవితంలో బాగు పడతదా? తలెత్తుకు తిరగ్గలదా? ఇంత గోరం నా కొడుకువల్ల జరిగినాది. అలాంటి కొడుకును కన్నందుకు నాకు ఈ దెబ్బలు చాలవు' అనవట్టె! ఈ బాద

ఆయన్నెప్పుడూ వదల్లేదు. ఒకటి రెండు సార్లు చావాలని కూడ చూశాడు. నేను ఉరేసి తాడు లాగేటప్పుడేమన్నాడో తెల్సా, 'వరలక్ష్మీ! నా మనస్సుకూ, శరీరానికీ శాంతినిస్తుంటివి. నువ్వు చిన్నాడి దగ్గర బతుకు. ఆడు నిన్ను మంచిగ చూసుకుంటడు' అని మెడ తిప్పేసిండు. నన్ను తీసుకెళ్ళి ఉరెయ్యి, బాబూ! మొగుణ్ణి చంపినందుకు నాకు ఈ దండన కావల్సిందే" అన్నది.

పక్కనున్న ఎర్ర బౌండు పుస్తకం చూసి, "ఏందది?" అని అడిగాడు శివరాం.

"మా నాన్న డైరీ!" అని చెప్పాడు ప్రదీప్.

దానిలో పేజీలు తిప్పి చూశాడు ఇన్స్పెక్టరు. చివరి పేజీలో రాసి ఉంది: "నా ఈ మరణానికి ఎవరూ బాధ్యులు కారు. నేనే నా రుగ్మతనుండి ఇలా స్వచ్ఛంద మరణాన్ని కోరుకున్నాను" అని. ఆ వాక్యాలు మరెవరైనా రాశారా అని డైరీలో మిగిలిన పేజీలు తిప్పి చూశాడు శివరాం. కానీ, ఆ దస్తూరీ రామదాసుదే అన్న విషయం ధృవపడింది. ముత్యాలకోవ లాంటి అక్షరాలు. ప్రదీప్ నడిగి అతను రాసిన పుస్తకంలోని పేజీలను చూశాడు. కానీ, అతడిది కొక్కిరాయి రాత! వరలక్ష్మమ్మకు చదువు రాదు.

ముసలాయన చిన్న ప్రేవుల కాన్సరు బాధ పడలేక తనే ఆత్మహత్య చేసుకున్నట్టు సాక్ష్యం చెప్తోంది. కానీ, రామదాసు పడే యమయాతన చూడలేక, వైద్యంచేయించే స్తోమతు లేక, చేయించినా బతుకుతాడన్న ఆశ లేక, రామదాసు కోరిక మేరకు, ఇద్దరూ కల్సే ఉరేసి అతడికి విముక్తి కలిగించారని, శివరాంకు తెలుసు. తల్లీ, కొడుకుల్లో ఎవరికీ పోయిన మనిషిపట్ల గౌరవమూ, ప్రేమే కానీ, ద్వేషం లేదు. ఎథనేషియా- కారుణ్య మరణం ప్రసాదించటానికి మన చట్టం అనుమతించదు. కరుణతో, కృపతో ముసలాయనకు మరణం ప్రసాదించినందుకు, సాక్ష్యం అందుకు విరుద్ధంగా ఉన్నా, పట్టుబట్టి, తను ఆ యువకుడి జీవితం భగ్నం చెయ్యాలా? ప్రేమతో మొగుణ్ణి చంపుకున్న ఆ పెద్దామెకు శిక్ష విధింపచేయాలా? వీళ్ళను అరెస్టు చేసినందువల్ల ఎవరికి లాభం! సాధారణ పరిస్థితుల్లో వీళ్ళు నేరప్రవృత్తి కలిగిన మనుషులు కాదు. ప్రదీప్‌కు తండ్రి సాయం లేకపోయినా ఇంజనీరింగ్ చదువు కున్నాడు. తనకు చట్టం విచక్షణాధికారం ఇవ్వలేదు. కానీ, పొరపాటుపడగలిగే అవకాశం ఇచ్చింది. సాక్ష్యం స్పష్టంగా రామదాసే ఉరేసుకున్నట్లు చెప్తోంది. ఉరేసుకునేందుకు లేచి నిలబడగల శక్తి అతనికి లేదని వాళ్ళు చెప్తేనే తనకు తెలిసింది. వాళ్ళు అబద్ధం చెప్పలేదు. తనూ సాక్ష్యం చెప్తున్న దాన్ని నిర్లక్ష్యం చెయ్యలేదు.

శివరాం ప్రదీప్‌కు డైరీలో తన తండ్రి రాసిన వాక్యం చూపినప్పుడు, "మా నాయన పలికిన మొదటి చివరి అబద్ధం అది!" అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు ప్రదీప్. డైరీలో తండ్రి తమని రక్షించాలన్న తపనతో రాసుకున్న మాటలు అతని గుండెను మెలితిప్పాయి. క్రింద రామదాసు సంతకం కూడ ఉంది. పోస్టుమాష్టరు తన విధినిర్వహణలో ఎక్కడా పొరపాటు పడలేదు, ఇక్కడా పడలేదు. అలా రాసుకున్నట్టుకూడ తనకూ, తన తల్లికీ కూడ తెలీదు. 'అయ్యో, నాయనా!' అని మూలిగింది అతని హృదయం.

ఇన్‌స్పెక్టరు శివరాం మరేం మాట్లాడలేదు, ఓదార్పుగా అతని భుజం తట్టి, జీపెక్కి బనవాడకు బయలుదేరాడు.

**ఆంధ్రభూమి** దినపత్రిక, శనివారం **భూమిక,** 2012 ఆగష్టు 24